నేడు సాలూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాలూరులో మంగళవారం మినీ జాబ్ మేళా జరగనుంది. టెన్త్, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకుని 18- 25 ఏళ్లలోపు గల నిరుద్యోగ యువతీ యువకులు మంగళవారం స్థానికప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే మినీ జాబ్ మేళాలో పాల్గొనవచ్చున్నారు. కావున ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటు వారి బయోడేటా, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు (ఒరిజినల్ మరియు జెరాక్స్), ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కాగలరు. ఇతర వివరాలు, సందేహాలకు 73825 59022, 94947 77553 మొబైల్ నెంబర్లను సంప్రదించగలరు.

ఉత్సవం.. వైభవం

- ఓవైపు పైడితల్లమ్మ పండగ.. మరోవైపు ఉత్సవాలు
- నగరమంతా సందడే
- విద్యుత్తు అలంకరణతో కాంతులీనిన నగరం

భక్తి గేయానికి కళాకారిణుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/టౌన్/కోట

కళలకు పుట్టినిల్లయిన విజయనగరంలో ఓవైపు పైడితల్లమ్మవారి పండగ హడావుడి... ఇంకోవైపు విజయనగర ఉత్సవాల ప్రాభవంతో నగరమంతా సందడి నెలకొంది. జిల్లా చరిత్ర, సంస్కృతికి అద్ధం పట్టేలా నిర్వహించిన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రెండు రోజులుగా వివిధ వేదికల్లో నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళలు, నాటకాలు, నాటికలు, పులివేషాలు, కత్తిసాములు ఇలా పలు కార్యక్రమాలు ప్రజలకు వీనుల విందు చేశాయి. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో నగరమంతా మెరిసిపోతోంది. శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, కూచిపూడీ వంటి నృత్య కళా ప్రదర్శనలు కట్టిపడేశాయి. జానపద కళారూపాలు, పులివేషాలు గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టాయి. క్రీడా పోటీలు, యుద్ధ క్రీడలు విద్యుల నగరమనే పేరును గుర్తుకు తెచ్చాయి. వివిధ నాటికలు, అంధులచే ఏకపాత్రాభినయాలు, పౌరాణిక నాటకాలు చరిత్రకు సాక్షీభూతంగా నిలిచాయి. కవి సమ్మేళనాలు ఆధునిక సమాజ నిర్మాణానికి అవిష్కరణలుగా నిలిచాయి. వాయిద్య విన్యాసాలు, పండిత పాండిత్య ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు భాషా సంస్కృతిని గుర్తుచేశాయి. ఓవైపు అయోధ్యమైదానంలో సినీ సంగీత కళాకారులు, టీవీ ఆర్టిస్టుల వినోద వల్లరి కుర్రకారును ఉర్రూతలూగించింది. మరోవైపు పుష్పాల ప్రదర్శనలు, ప్రదర్శన, దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన చేతివృత్తి ఉత్పత్తుల ప్రదర్శన శాల. ఇలా చెప్పుకుంటూ పోతే ఊరంతా సందడి నెలకొంది.

చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

సాంస్కృతిక నీరాజనం

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆనంద గజపతి ఆడిటోరియంలో రెండో రోజు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. వరలక్ష్మి త్యాగరాజ సంగీత నృత్య కళానికేతన్ , వాగ్దేవి బృందం, గీతిక, టి సత్యనారాయణ, పి.సూర్య కుమారి , ఎస్.సత్యనారాయణ శర్మ, సౌమ్య, శ్రీ భగవతి నత్య కళామందిర్, ఆరాధ్య తేజేస్వి, వర్ణ డాన్స్ అకాడమీలు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్య విన్యాసాలు వీనుల విందుగా నిలిచాయి. కె.రంజని, జి.రాధిక, కె.పద్మప్రియ, బాలభవన్, ఆముక్త మాల్యద, ఎం.సత్య సాయి రోజా, సత్యలత, రామచంద్ర శేఖర్, మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల వారు శాస్త్రీయ సంగీతాలను, భక్తి సంగీతాలను రమ్యంగా ఆలపించారు. వంశీకృష్ణ బృందం వీణ, ఎం.కామేశ్వరరావు ఫ్లూట్ వాయిద్యాలతో అలరించారు. ఘంటసాల స్మారక పీఠం వారు ఘంటసాల పాటలను ఆలపించారు. వేదిక ఇంఛార్జులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమా శంకర్ , డివిజనల్ పిఆర్ఓ ఎస్.జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రీ, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తదితరులు మెమెంటోలను, సర్టిఫికేట్ లను అందజేసి శాలువలతో సత్కరించారు.

కోలాటం ఆడుతున్న బృందం

పులివేషధారణలు

రంజింపజేసిన జానపద కళారూపాలు

లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదిభట్ల నారాయణదాసు కళాప్రాంగణం జానపద కళారూపాల ప్రదర్శనతో, హరికథా గానంతో మార్మోగింది. తొలుత ఆదిభట్ల రవి పైడితల్లి చరిత్ర హరికథా గానంతో ప్రేక్షకులను అలరించారు. కనకమహాలక్ష్మి జానపద గీతాల ఆలాపన చేశారు. జానపద కళాబృందాలు కోలాటం, చెక్కభజన కళారూపాలను ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపచేశాయి. పైడితల్లి అమ్మవారిపై రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని కూడా ప్రదర్శించారు.

వీనులు విందుగా ఏకపాత్రాభినయాలు

గురజాడ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఏకపాత్రాభినయాలు అందరినీ అలరించా యి. సత్యహరిశ్చంద్ర నాటకంలో వివిధ సన్నివేశాలను నక్షత్ర, సత్య హరిశ్చంద్ర, దేవి చంద్రమతి ఇలా వివిధ ఏకపాత్రాభినయాలు రంజింపజేశాయి.

ఉర్రూతలూగించిన కార్తీక్

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అయోధ్యా మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన మెగా మ్యూజికల్ నైట్ అందరినీ అలరించింది. ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు కార్తీక్ యువతను ఉర్రూతలూగించారు. ఆయన పాడిన సినీపాటలు యువతీ యువకులతో డాన్సులు చేయించాయి. ఈ కార్యక్రమాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తిలకించారు.

ఆకర్షించిన ఫ్లవర్ షో

పూలతో తయారు చేసిన డాల్ఫిన్ ఆకృతులు

ట్యాంక్‌బండ్ రోడ్డులోని మాన్సాస్ స్థలంలో ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. గతం కంటే భిన్నంగా ఈసారి పుష్పాలతో తయారు చేసిన వివిధ రకాల పక్షులు, క్రీడ, వాయిద్య పరికరాలు అందరినీ కట్టిపడేస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చి ఏర్పాటు చేసిన రక రకాల పుష్పాలు మగువుల మనసును దోచుకుంటున్నాయి. సందర్శకులు ఇక్కడ ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడుతున్నారు. ప్రదర్శనలో ఫ్రెష్ ఫ్లవర్స్, డ్రై ఫ్లవర్స్, వెజిటబుల్ కార్వింగ్, సైకత శిల్పం, వివిధ రకాల మొక్కలను ప్రదర్శించారు.

అలరించిన వేణుగానం

స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో రెండోరోజు సోమవారం నిర్వహించిన లలిత ,శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకున్నా యి. వాటితోపాటు అంత రించి పోతున్న వేణు గానానికి అవకాశం కల్పించారు. గడిచిన 30 ఏళ్ల నుంచి వేణుగానం కోసం ఎంతో ప్రచారం చేస్తున్న కామేశ్వరరావు ఆలపించి, అలరించారు. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి వివిధ నృత్యరూపాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వేణువు వాయిస్తున్న కామేశ్వరరావు

ఘటాన్ని తీసుకెళ్తున్న హోంమంత్రి అనిత ; ఆలయంలో పూజలు చేస్తున్న అశోక్ గజపతిరాజు

ఘనంగా తొలేళ్ల సంబరం

పట్టువస్త్రాలు సమర్పించిన అశోక్ కుటుంబీకులు
అమ్మవారిని దర్శించుకున్న హోంశాఖా మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు ఘటాలు ఊరేగింపుగా వెళ్లి కోటలోని రౌండ్ మహల్‌లో ఘటాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం కోట ఎదురుగా ఘటాలను ఉంచి పూజారి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. తొలేళ్ల ఉత్సవం నేపథ్యంలో ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. వందలాదిగా మహిళలు అమ్మవారికి ఘటాలు తీసుకెళ్లి సమర్పించారు. పులివేషాలు, కర్రసాతిము, కత్తిసాము, విచిత్ర వేషధారణలతో నగరంలో సందడి నెలకొంది. మాన్సాస్ చైర్మన్, పైడితల్లి అమ్మవారి ఆలయం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత ఘటాలు మోసుకొని వెళ్లి అమ్మవారిని తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దంపతులు పైడితల్లి అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఘటంతో యువతి

సిరిమానోత్సవ భద్రతా ఏర్పాట్లపై హోంమంత్రి సమీక్ష

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఘటాన్ని సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఆమెకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న కంట్రోల్ రూమ్ సందర్శించారు. సినిమానోత్సవం సందర్భంగా చేసిన పద్ధతి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఆమె వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, దేవాదాయశాఖ ఎసి రామచంద్ర మోహన్, సిఎఫ్ఒ త్రినాధరావు ఉన్నారు.

ఆలయం వద్ద ఘటాలతో భక్తులు

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యుఎంహెచ్ఇయు నాయకులు

హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి
కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హెల్త్ సెక్రటరీలు సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం నుంచి డిఎంహెచ్ఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. ధర్నా వద్దకు కలెక్టర్ శ్యాం ప్రసాద్ వచ్చి సమస్యలు విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యాన ఎఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రమాదేవి, స్వర్ణలత, ఢిల్లీశ్వరి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచిన సచివాలయ ఎఎన్ఎంలను తక్షణమే ఆరోగ్య శాఖపరిధిలోకి తేవాలని కోరారు. హెల్త్ ఎంప్లాయిస్‌కు అమలు చేసే 35 క్యాజువల్ లీవ్స్ ఎఎన్ఎంలకు కూడా అమలు చేయాలని, 60 రకాల మొబైల్ యాప్స్‌లో పనిచేస్తున్న భారాన్ని తగ్గించాలని, క్షేత్రస్థాయిలో పనిచేసే ఎఎన్ఎంలకు ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం రెవెన్యూ డిపార్ట్మెంట్లో ఇచ్చినట్టుగా అన్నిచోట్ల వేసే అవకాశం లేదా, బయోమెట్రిక్ పద్ధతికి వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనిఫాం అలవెన్స్, వ్యాక్సిన్ క్యారియర్ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సులు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతాలలోని పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో ఎఎన్ఎంలకు రాత్రి షిఫ్టులు వేయడం మానుకోవాలని, జిఎన్ఎం ట్రైనింగ్ పూర్తయిన వారికి ఎంపిహెచ్ఎ (ఎఫ్) ప్రమోషన్లు కల్పించాలని, ఎఎంఎం జాబ్ చార్ట్ ప్రకారం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోపు మాత్రమే పని చేయించాలని, ఆదివారాలు, పండుగ సెలవుల్లో డ్యూటీలు వేయరాదని, సెలవు మంజూరు సులభతరం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు. శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, సిఐటియు నాయకులు జి.వెంకట రమణ, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు లక్ష్మిమి, భాగ్యం, స్వర్ణ, ఝాన్సీ రాణి, రాణి ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై విజిలెన్స్ తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో లక్కాయి గూడ నుంచి ఈతమాను గూడ వరకు రూ.కోటీ 80 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు పనులను శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ డిఇ సత్యనారాయణ, ఎఇ గణేష్ సోమవారం తనిఖీ చేశారు. అలాగే 2023లో గొయ్యిగూడ నుంచి జోడిమానుగూడలో రూ.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును పరిశీలించారు. రోడ్డు కొలతలు, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ తనిఖీలు ఎఇ నాగభూషణరావు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మద్యం షాపుల లాటరీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మద్యం వ్యాపారులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ ద్వారా కేటాయింపు ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 8గంటలకు స్థానిక ఎంఎ నాయుడు కన్వెన్షన్ హాలులో కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు మ్యాన్యువల్ పద్ధతిలో మద్యం షాపులకై దరఖాస్తు చేసుకున్న షాపులు వారీగా లాటరీ తీసి మద్యం దుకాణాలు కేటాయించారు. జిల్లాలో 52 షాపులకు గానూ 1376 దరఖాస్తులు రాగా, వాటిని ప్రాధాన్యతా క్రమంలో షాపుల వారీగా దరఖాసుదారులను పిలిచి, లాటరీ విధానంపై వారికి అవగాహన కల్పించి, ఈ కేటాయింపుల ప్రక్రియ జరిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. అయితే వీరఘట్టం మండలంలోని రెండు షాపులకు 130కి పైగా దరఖాస్తులు రావడం అందర్నీ ఆకర్షించింది. ఈసారి మద్యం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువగా మహిళల పేరు ఉండడం, వారు కూడా డ్రాకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్సైజ్ అధికారులతో పాటు ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. డ్రాలో విజేతగా నిలిచిన వారితో పాటు మరొక ఇద్దర్ని స్టాండ్ బైలుగా ప్రకటించారు. లాటరీలో గెలిచి షాపుల ఏర్పాటుకు ముందుకు రాని వారు ఎవరైనా ఉంటే ఆ స్థానంలో స్టాండ్‌బైలను విజేతలుగా ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. ఒప్పందం పూర్తయిన తర్వాత మంగళవారం డ్రాలో విజేతలకు షాపులను అప్పగిస్తామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్ తెలిపారు.

లాటరీ టోకెన్ తీస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

నాయుడు కన్వెన్షన్ హాల్ వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న మద్యం వ్యాపారులు

పారదర్శకంగా మద్యం దుకాణాల ప్రక్రియ పూర్తి

నూతన మద్యం పాలసీ ప్రక్రియను జిల్లాలో పారదర్శకతతో చేపట్టామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఒక్కో దుకాణానికి అత్యంత పారదర్శకంగా లాటరీ నిర్వహించారని, లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అందరికీ ఆమోద యోగ్యంగా మద్యం దుకాణాల కేటాయింపుల్లో సమాన అవకాశం కల్పించామన్నారు. మద్యం నూతన విధానాన్ని జిల్లాలో పక్కాగా అమలయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ రామచంద్రరావు, సిఐ, ఎస్ఐలు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి
కలెక్టరేట్ ఎదుట గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కురుపాం గిరిజన ఇంజనీరింగ్ కాలేజీ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ 2020లో అప్పటి వైసిపి ప్రభుత్వం కురుపాం వద్ద గిరిజన ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి టేఖరకండి రెవెన్యూలో 105 ఎకరాల భూమిని ప్రతిపాదించారని, అందులో 32 ఎకరాల భూమిని టేఖరకండి, చంద్ర శేఖర్ రాజు పురం గిరిజనులు 26 మంది గత 40, 50 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్నీ రెవెన్యూ అధికారులు విస్మరించి అడ్డుగోలుగా ప్రతిపాదనలు పంపి ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేశారని అన్నారు. గిరిజనులు పోరాడితే సర్వే చేసి 32.32 ఎకరాల భూమిని గిరిజనులు సాగు చేస్తున్నట్లు గుర్తించారని, కానీ అప్పటి రాజకీయ పలుకు బడితో గిరిజనులపై దౌర్జన్యం చేసి పోలీసులు ద్వారా కొన్ని కట్టడాలు చేపట్టారని చెప్పారు. తప్పని పరిస్థితుల్లో నిర్వాసితులు హైకోర్టు ఆశ్రయిస్తే హై కోర్టు భూమికి రక్షణ కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఇప్పటికైనా గిరిజనులకు నష్టపరిహారం ఇస్తే భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ భూమి పోతే గిరిజనులకు జీవనాధారం పోతుందని, కావున ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని ఈ ప్రభుత్వమైనా సరిదిద్ది గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పరిశీలన చేసి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం జియ్యమ్మవలస మండల కార్యదర్శి గరుగుబిల్లి శ్రీనివాసరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

భారీవర్షాలపై విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

ప్రజాశక్తి - పార్వతీపురం

బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కె.చలపతిరావు తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులునైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకుగానూ జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఫోన్ నెంబర్ 8332046778 (ఎల్ఎంసి) 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వర్షాకాలం కారణంగా తెగపడిన విద్యుత్ వైర్లను గానీ, తడిసిన విద్యుత్ స్తంభాలను గానీ విద్యుత్ వైర్లపై తెగపడిన చెట్ల కొమ్మలను గాని ప్రజలు నేరుగా తాకవద్దని ఆయన కోరారు. వీలైనంతవరకు రబ్బరు చెప్పులను ధరించడం శ్రేయస్కరమని, వ్యక్తిగత భద్రత ముఖ్యమని చెప్పారు వర్షాల కారణంగా ఏదైనా విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తినచో దగ్గరలో గల విద్యుత్ సెక్షన్ ఆఫీసులకు గానీ, టోల్ ఫ్రీ నెంబర్ 1912 గానీ, కంట్రోల్ రూమ్ సర్కిల్ ఆఫీసు పార్వతీపురం నెంబర్ 83320 46778 ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేసుకుంటే సమస్య వెంటనే పరిష్కరించనున్నామని ఎస్ఇ చలపతిరావు చెప్పారు.

ఇంటర్ విద్యార్థులకు 'అపార్' తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాల్లోని అన్ని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వెంటనే అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నెంబర్‌ను క్రియేట్ చేయాలని జిల్లా వృత్తి విద్యాధికారి డి.మంజుల వీణ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల ఆడిటోరియంలో ప్రభుత్వ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ఎపిఎంఎస్, కెజిబివి, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు శాశ్వత విధానంలో ప్రత్యేక సంఖ్యతో కూడిన గుర్తింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్న నేపథ్యంలో జిల్లాలో గల జూనియర్ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులకు అపార్ ఐడిని కేటాయించాల్సిందిగా సూచించారు. ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న యుడైస్ ప్లస్ వెబ్సైట్లో విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక నెంబరు కేటాయింపు విధానం అమల్లో ఉందన్నారు. అయితే సంబంధిత విద్యార్థి ఇంటర్ పూర్తికాగానే యుడైస్ ప్లస్ డేటా గడువు తీరిపోతుంది. డిగ్రీ, పీజీ విద్యలకు వెళ్లే విద్యార్థులకు సంబంధించిన అకాడమిక్ ప్రగతి, గతంలో చదివిన కోర్సుల వివరాల నమోదు చేసే వ్యవస్థ లేకుండా పోయింది. కేంద్రం అమల్లోనికి తీసుకొస్తున్న "ఆపార్"తో ఆయా సమస్యలకు చెక్ పడనుందని ఆమె తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారుగా 1280 మంది "అపార్" ఐడీలను జనరేట్ చేసుకున్నారన్నారు.

నేడు విజయనగరం పైడితల్లమ్మ సిరిమానోత్సవం

విజయనగరం : ఉత్తరాంధ్రులు ఇలవేల్పుగా భావించే విజయనగరం పైడితల్లమ్మ సిరిమాను సంబరానికి సర్వం సిద్ధమైంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకే సిరిమాను సంబరం ప్రారంభం కానుంది. ఈ ఏడాది భక్తులకు ఉచిత ఉచిత దర్శన సదుపాయం కల్పించారు. ఈ ఉత్సవానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు చేశారు.

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 119 అర్జీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. వచ్చిన అర్జీలపై తగిన సమాచారం ఇవ్వదగిన అధికారులు మాత్రమే పిజిఆర్ఎస్‌కు హాజరు కావాలన్నారు. గత వారంలో వచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలు గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలిస్తూ తక్షణ చర్యలు గైకొనాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి 119 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేయాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉన్న గిరిజన యువతక కోసం బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేపట్టాలని కోరుతూ సోమవారం నిరుద్యోగ యువత జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి వెట్టిచాకిరీ చేస్తూ మోసపోతున్నారనీ చెప్పారు. ఆదివాసి నిరుద్యోగ యువతి యువకులకు బ్యాక్‌లాగ్ పోస్టులు, ప్రత్యేక నియామకాలు ద్వారానైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో వృత్తి పరమైన శిక్షణలు పొందిన ఎస్‌టిలకు స్వయం ఉపాధి కోసం ట్రైకార్ ద్వారా రుణాలు కల్పించాలని కోరారు. తమకు న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నిరుద్యోగ మహిళలు రాయల హరిత, కొండ తామర సోమయ్య, కొండ తామర రామ రాయల అరవింద్, బాబ్జి, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సాంకేతిక శిక్షణ

ప్రజాశక్తి -భామిని

ధాన్యం పండించే ప్రతీ రైతుకు ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం మద్దతు ధర అందాలని సివిల్ సప్లయ్ టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ అన్నారు. సోమవారం భామిని రైతు సేవా కేంద్రంలో ఈ ఏడాదికి సంబంధించి ధాన్యం కొనుగోలుపై టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లకు సాంకేతిక శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ ఏడాది క్వింటా కామన్ ధాన్యం రకానికి 2300, గ్రేడ్ ఏ రకానికి 2320 మద్దతు ధరను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు తేమ శాతం ఎలా పరీక్షించాలి, ధాన్యంలోని సేంద్రియ, అసేంద్రియ పదార్థాన్ని ఎలా వేరు చేయాలి అనే అంశాలను సివిల్ సప్లై, టెక్నికల్ అసిస్టెంట్ వివరించారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉండి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని వ్యవసాయ అధికారి సింహాచలం అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, గ్రామీణ వ్యవస్థ సహాయకులు పాల్గొన్నారు.

రసాయనాలను నిరోధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పళ్ళు పండించేందుకుగాను ప్రాణాంతక రసాయనాల వాడకం నిరోధించాలని, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి, జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్‌ని కలిసి జిల్లాలో అరటి, మామిడి తదితర వాటికి కాల్షియం కార్బైట్ తదితర ప్రమాదకర రసాయనాలను వాడి కృత్రిమంగా పళ్ళు పండించి విరివిగా అమ్మకాలు చేస్తున్నారన్నారు. వాటి వల్ల ప్రజలు క్యాన్సర్ లాంటి భయంకరమైన రోగాల భారిన పడే అవకాశం ఉందన్నారు. రానున్న కార్తీక మాసం రోజుల్లో రసాయనాలు వినియోగించే అరటి పళ్ళు అధికంగా విక్రయించే అవకాశాలు ఉన్నాయని తక్షణమే పార్వతీపురం పట్టణం, సాలూరు పట్టణం, పాలకొండ, వీరఘట్టం తదితర పట్టణాలతో పాటు పల్లెల్లో సైతం రసాయనాలు వినియోగించి పండించే పళ్ళు విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మహాదేవివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధి మహాదేవివలసలో సోమవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, గర్భిణీలు, చంటిపిల్లలు, మధుమేహ, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జి.పైడితల్లి , ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

కెజిబివి ఉద్యోగాలకు19 దరఖాస్తులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడులో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్, అవుటు సోర్సింగ్ ప్రాతిపదికన కుక్ పోస్టుకు 19 దరఖాస్తులు వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి-2 ఆర్.ఆనందరావు సోమవారం తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 15న సాయంత్రం 5 గంటల్లోపు ఎంఇఒ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

తలవరంలో నేడు రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఏ విధమైన భూ సమస్యలున్నా సదస్సు వద్దకు వచ్చి తెలియజేయాలని ఆయన రైతులను కోరారు.

ఓటర్ల జాబితాను తయారు చేయండి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

త్వరలో నీటి సంఘాల ఎన్నికలు జరగనున్న సందర్భంలో ఓటర్ల జాబితాను తయారు చేయాలని తహశీల్దార్ డి.పకీరు అన్నారు. సోమవారం ఇరిగేషన్ అధికారి జివి రఘు ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒలతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ మండలంలోని మీడియం ఇరిగేషన్ కింద జియ్యమ్మవలస, శిఖబడి, గెడ్డతిరువాడ, తుంబలి, చినమేరంగి, గౌరమ్మపేట, కుదమ, పరజపాడు పరిధిలో 8నీటి సంఘాలకు ఒక్కో సభ్యునికి 12 మంది చొప్పున ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులుండాలన్నారు. విఆర్‌ఒలు తమ పరిధిలో ఉన్న రైతుల ఓటర్ల జాబితాను తయారు చేయాలని తహశీల్దార్ ఆదేశించారు. అనంతరం విఆర్‌ఒల పరిధిలో ఉన్న భూముల వివరాలు సంబంధిత సభ్యులు తయారు చేసి నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు సిద్ధంగా ఉండాలని విఆర్‌ఒలు ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రతి రోగికి పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు, నిర్దారణ పరీక్షలు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు పెదబొండపల్లి పిహెచ్‌సిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి రికార్డులో రోగుల ఆరోగ్య సమస్యల వివరాలు పరిశీలించి జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చేవారికి నిర్వహిస్తున్న పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు, చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. రోగుల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ రోగ నిర్దారణ పరీక్షలు ఏ మేరకు చేపడున్నారో, వాటి ఫలితాలు వివరాలు ల్యాబ్ రికార్డులో తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి అని ఆదేశించారు. అనంతరం మందుల నిల్వలను తనిఖీ చేసి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు (నీలి రంగు) లభ్యతను పరిశీలించి అన్ని పాఠశాలలో అందుబాటులో సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రసవాలు గదిని పరిశీలించి ప్రతి నెలా ఏ మేరకు సాధారణ కాన్పులు చేపడుతున్నారని సిబ్బందిని అడిగి పార్చురిషన్ రిజిస్టర్ తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి. అనూష, సూపర్వైజర్లు వెంకట నాయుడు, పార్వతి, శంకరరావు, జయలక్ష్మి, జయగౌడ్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకల్లా గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరఘట్టం నుండి ద్విచక్ర వాహనంపై పి శంకర్రావు, ఎన్ అంబరీష్ పార్వతిపురం వెళుతుండగా కడకల్లా మలుపు వద్ద పార్వతీపురం నుండి వీరఘట్టం వైపు వస్తున్న లగేజ్ ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. వీరిని 108 సహాయంతో పార్వతిపురం ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని అడ్డాపుశీలలో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అడ్డాపుశీల నుంచి పిన్నింటి రామినాయడువలస వరకు రెండు కిలోమీటర్ల పొడవున రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు అందుకు తగ్గ నిధులు కూడా విడుదల చేశామన్నారు. మంచి పాలన అందించడమే పాలకుల లక్ష్యమని అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : పల్లె పండుగతోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఏగులవాడ పంచాయతీలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోటపల్లి - గుణుపూర్ బిటి రహదారి నుంచి ఏగులవాడ పంచాయితీలో గల మరిపల్లి గ్రామానికి రూ.కోటీ పదిలక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న బిటి రహదారి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు కోలా రంజిత్‌కుమార్, వెంపటాపు భారతి, జనసేన నాయకులు నేరుడబిల్లి వంశీ, ఇఒపిఆర్‌డి జి.రమేష్ బాబు, ఎపిఒ పి.బావాజీ, జెఇ పి.నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ పి.అలివేలు, పంచాయతీ కార్యదర్శి కె.విజయకాంత్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతానగరం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వారం రోజులపాటు నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాలను ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర సోమవారం ప్రారంభించారు. మండలంలోని సుమిత్రాపురం గ్రామం నుంచి వల్లరగుడబ గ్రామం వరకు రెండు కిలోమీటర్ల పొడవున రెండు కోట్ల రూపాయలతో నిర్మించనున్న బిటిరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో సిసిరోడ్లు, బిటి రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను పెద్ద ఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఉపాధి నిధులతో నియోజక వర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మంచి కార్యక్రమాన్ని రూపు దిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతువేణు గోపాలనాయుడు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ ప్రసన్న కుమార్, పార్వతీపురం టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, జి.చంద్రమౌళి, సీతానగరం, పార్వతీపురం, గరుగుబిల్లి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతానగరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర

అయ్యప్ప సన్నిధానం ప్రారంభం

మండలంలోని కృష్ణరాయపురంలో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించిన అయ్యప్ప స్వాముల సన్నిధానాన్ని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గునుపూరు అన్నంనాయుడు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రైతు గోపాలనాయుడు, గొట్టాపు వెంకట నాయుడు, గుణుపూర్ తాతబాబు, పెద్దింటి శ్రీరాములు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : ఈనెల 14 నుంచి 20 వరకు గ్రామాల్ల తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని ఎంపిడిఒ కె.విజయలక్ష్మి తెలిపారు. మండలంలో అంపావల్లి, వెంగళరాయపురం, నూకలవాడలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ అంబేద్కర్, ఇఒపిఆర్‌డి పుష్పనాథ ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని పల్లె పండుగ కార్యక్రమం సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు సమక్షంలో ఎన్ఆర్ఈజీఎస్ సమన్వయంతో ఆమోదం పొందిన పనులకు భూమి పూజ నిర్వహించారు. రాయిమానుగూడ, మండ గ్రామ పంచాయతీల్లోని దీసరిగూడ, నాయుడుగూడ, కుడ్డపల్లి, కెపి ఈతమానుగూడ, పెద్దగూడ, గోయిది, పత్తికగూడ తదితర గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించారు. అభివృద్ధి పనులపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఎపిఒ సాగర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని చిదిమి, యు.వెంకంపేట గ్రామాల్లో సోమవారం ఉపాధి ఎపిడి జి. శ్రీహరిరావు ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ డి.ఉమామహేశ్వరరావు ఇంకుడు గుంతలకు భూమి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సత్యంనాయుడు, మండల ఇంజనీర్ డి కళ్యాణదుర్గ, గ్రామ పెద్దలు బి.నీలకంఠం నాయుడు, టెక్నికల్, ఫీల్డ్, సహాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఎల్విన్ పేట పంచాయితీ సవర కోటపాడు ఐటిడిఎ ఉద్యానవన కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డుకు ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, ఎంపిడిఒ సాల్మన్ రాజ్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, మాజీ ఎంపిపి తాడంగి లక్ష్మణ రావు, వెంపటాపు భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అధికారులు ప్రజాప్రతినిధులు పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎంపిడిఒ జి పైడితల్లి, మండల ఉపాధి హామీ పథకం ఎపిఒ మండల గౌరీనాథ్ తదితరులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరసపు నీటిని భూమిలో ఇంకించే ఇంకుడు గుంత నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ ఇందుమతి మాట్లాడుతూ ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్ గోపాల రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు, బిజెపి నాయకులు తుమ్మగుంట రాము, పెదిరెడ్డి అశోక్, ఉపాధిహామీ పథకం సాంకేతిక సహాయకులు కొట్నాన నిర్మల, మరిచర్ల హరికృష్ణ, ఎం భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి

ప్రజాశక్తి- సీతానగరం

ఉచితంగా ఇసుక సరఫరా చేసి భవన కార్మికులకు ఉపాధి కల్పించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము, మండల కార్యదర్శి తోలాపు రమేష్, సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరగి పోవడం విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని అనేక కారణాలతో పాటు ఇసుక సమస్యపై ప్రజలు ఆగ్రహంతో గత ప్రభుత్వాన్ని గద్దె దింపేశారని గుర్తు చేశారు. ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని వందరోజుల పాలనలో చూస్తే ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి పెద్దతేడా లేకుండా పోయిందని చెప్పారు. మన్యం జిల్లా కేంద్రానికి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న భామిని మండలంలో కాట్రగడ వద్ద నుంచి ఇసుక తేవాలంటే రవాణా రేటు విపరీతంగా పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ అమలు చేయకపోవడం వల్ల ఇసుక లభించడం లేదన్నారు. రవాణా చార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదన్నారు. కొన్నిచోట్ల మరింత పెరిగాయని ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి పదే పదే హెచ్చరించిన మార్పు రాలేదన్నారు. ఇసుక కొరత, అధిక రేట్లు వల్ల భవన నిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ఇసుక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని చెప్పిన ప్రభుత్వం ప్రకటనలకు ఆచరణలకు పొంతన లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచిత ఇసుక లభించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, అందరికీ అందుబాటులో పాత పద్ధతిలో ఇసుక రీచ్‌లను సీతానగరం, బూర్జ గ్రామంలో ఏర్పాటు చేయాలని, అవినీతిని అరికట్టి భవన నిర్మాణ కార్మికులు ట్రాక్టర్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు రంకిరెడ్డి శంకర్రావు, టుంపిల్లి వెంకటరమణ, బురిడీ శ్రీను, మర్రాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రాన్నిస్తున్న యూనియన్ నాయకులు

‘అక్కడ మద్యం షాపు పెట్టొద్దు’

ప్రజాశక్తి- సాలూరు రూరల్

జన సంచార కూడలిలో మద్యం షాపులు పెట్టవద్ద పట్టణ పౌర సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. సాలూరు పట్టణం చిన బజార్ కూడలి వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు అంటూ సోమవారం పౌర సంఘాల ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ చిన బజార్ సమీపంలో వాసవి కన్యకా పరమేశ్వరాలయం, శివాలయం, సంతోషిమాత, దుర్గమ్మ, సాయిబాబా ఆలయాలకు వెళ్లాలంటే చినబజార్ మీదుగా పట్టణంలోని పలు వీధుల నుంచి భక్తులు రోజు ఈ కూడలి గుండా రాకపోకలు సాగించాలని పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు వందల సంఖ్యలో చిన బజారు కూడలి మీదుగా వెళ్లి వస్తుంటారని ఇటువంటి చోట మద్యం షాపులు ఏర్పాటు చేయడం మంచిదికాదన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ప్రదేశంలో మద్యం షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహశీల్దార్, కమిషనర్ తదితరులకు వినతి పత్రాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందిస్తున్న సిఐటియు నాయకులు

సత్వర న్యాయం అందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తమకు జరిగిన అన్యాయానికి న్యాయం కోసం సామాన్య ప్రజలు పోలీసు వారిని ఆశ్రయిస్తారని, సమస్యలను సానుకూలంగా విని, చట్ట పరిధిలో విచారణ జరిపి, పూర్తిస్థాయి పరిష్కారం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలంలో ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 3 ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం జరిగే ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఆర్.బి. సిఐ వి.వి.సి.ఎం. ఎర్రంనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించండి

సీతంపేట: తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు గిరిజనులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు సమర్పించారు. సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ స్థానిక ఐటిడిఎలో సోమవారం పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వచ్చిన వినతుల్లో కొన్ని... చిన్నబగ్గకు చెందిన కమల సిహెచ్‌డబ్ల్యు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గోపిదేవి పేటకు చెందిన వెంకటరమణ ఆటో రుణం ఇప్పించాలని, బందమానుగూడకు చెందిన నాగరాజు నీరు-చెట్టు బిల్లు మంజూరు చేయాలని కోరారు. బిల్లాగూడకు చెందిన సిమ్మయ్య మినీ అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని, మెట్టూరుకు చెందిన శంకరరావు తాగునీటి సదుపాయం కల్పించాలని, రాయకోటికి చెందిన జగన్నాధరావు కమ్యూనిటీ హాల్ బిల్లు మంజూరు చేయాలని విన్నవించారు. శంభాంకు చెందిన చైతన్య ఎంబిబిఎస్ చదువుకొనేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, గిరిజన సంక్షేమ సంఘం ఇఇ సింహాచలం, డిప్యూటీ ఇఒ పి.నారాయుడు, ఎపిడి సన్యాసిరావు, సిడిపిఒ రంగలక్ష్మి, ఐటిడిఎ స్పోర్ట్స్ పర్యవేక్షణ అధికారి జాకబ్ దయానంద్, ఎఎంఒ టి.బాబు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

త్వరలో జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికలకు రైతులకు సంబంధించిన ఓటర్ల జాబితాలను గ్రామ రెవెన్యూ అధికారులు సిద్ధం చేయాలని మండల ఉప తహశీల్దార్ పెల్లూరి సత్యలక్ష్మికుమార్ సోమవారం వెల్లడించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తోటపల్లి పాత రెగ్యులేటర్ కుడి, ఎడమ, కాలువల అసిస్టెంట్ ఇంజనీర్ డివి రమణతో కలిసి గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిటి మాట్లాడుతూ సాగునీటి సంఘాలకు పూర్వ వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం ఈనెల 16 నుంచి నవంబర్ 24వ తేదీలోగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశించిందన్నారు. మండలానికి సంబంధించి తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ, కాలువలకుచ 13 సాగు నీటి చెరువుల సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, గ్రామ రెవెన్యూ అధికారులు మాధలింగి ధనుంజయరావు, ఉద్దవోలు కరుణాకర్, మండంగి గౌరీశంకర్రావు, పడాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ స్వతంత్రత కాపాడాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా ఏర్పాటు తర్వాత పార్వతీపురం ఐటిడిఎ మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతోందని ఇది ఏమాత్రం సహించేది లేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు చలో ఐటిడిఎ పేరుతో ఐటిడిఎ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఐటిడిఎకు రెగ్యులర్ పిఒ, డీడీ లేకపోతే పాలన ఎలా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమం కోసం ఐటిడిఎకు వచ్చే డబ్బులు గిరిజన సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ స్వతంత్రతను కాపాడాలని, పాలక వర్గం సమావేశాలు ఏర్పాటు చేసి గిరిజన సమస్యలు చర్చించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ర్యాలీ చేసి జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగరాజు, ప్రభాకర్, సీతారాం వెల్లూరు, బంగార్రాజు, భాస్కరరావు, నాగార్జున, ముత్యాల, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని తానవలస గ్రామానికి చెందిన గిరిజనలు చాలా ఏళ్ళ నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం నాయకులు పి. రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం కౌన్సిలర్ విజయ లక్ష్మిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యపై ఎన్నిసార్లు వినతులు సమర్పించినప్పటికీ అధికారులలో చలనం లేదని, ఇప్పటికైనా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను సర్వే నిర్వహించి వారికి పట్టాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

ముసాయిదా జాబితాలు ఏర్పాటు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మిర్తివలస, వెంగాపురంలో రైతు సేవా కేంద్రాల్లో ఇ- పంట ఖరీఫ్ 2024 సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించిన ముసాయిదా జాబితాను మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే రైతుల ఇ-పంట నమోదు వివరాల సవరణ కోసం రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాను రైతు సేవా కేంద్రంలో ఉంచామన్నారు. మండలంలో గల రైతు సేవా కేంద్రాల్లో గ్రామ సభలు గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. స్వీకరించిన అభ్యంతరాలను మళ్లీ మార్పులు చేసి తుది జాబితాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు

ముసాయిదాను పరిశీలిస్తున్న ఎఒ, తదితరులు

ఎట్టకేలకు ఎం.రాజపురం రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎం.రాజపురం గ్రామ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. కోటితో సిఎస్‌పి రోడ్డు నుంచి ఎం. రాజపురం మీదుగా కత్తుల కవిటి గ్రామం వరకు ఐటిడిఎ పర్యవేక్షణలో బీటీ రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. త్వరలో శంకుస్థాపన కూడా చేయనున్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్యాకేజీ కింద బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టినా వైసిపి ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో రహదారి గుంతలు గుంతలుగా ఏర్పడడంతో వాహనదారులు, గర్భిణులు, విద్యార్థులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరైన రోడ్డు

నేడు ప్రత్యేక ప్రజాదర్బార్

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండల కేంద్రంలో మంగళవారం ప్రత్యేక ప్రజా దర్బార్ నిర్వహించనున్నారని ఎంపిడిఒ పైడితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరవుతారని చెప్పారు. మండలానికి చెందిన వివిధ గ్రామల ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు చెప్పుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.